క్లుప్తంగా

12న ఉచిత వైద్యశిబిరం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లో ఈ నెల 12న ఉచిత వైద్యశిబిరం ని ర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎం.డి డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎన్‌టీ వైద్యుడు సతీష్ రోగులకు వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు శిబిరం నిర్వహించనున్నట్లు, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రామారావు

నెల్లిమర్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గిడుతూరి రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పూసపాటిరేగ ఎంపీడీఓగా పనిచేసిన రామారావును నెల్లిమర్ల మండలానికి ప్రభుత్వం బదిలీ చేసింది. నెల్లిమర్ల ఎంపీడీఓగా పనిచేసిన జి.గిరిబాలను వేరే ప్రాంతానికి బదిలీ చేస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పూసపాటిరేగ ఎంపీడీఓగా రాధిక..


రాధిక

పూసపాటిరేగ: ఎంపీడీఓగా ఎం.రాధిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం నుంచి పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేవిధంగా కృషి చేస్తానన్నారు.

పురుషోత్తమ చౌదరి సేవలు చిరస్మరణీయం

విజయనగరం టౌన్: క్రీస్తు సంఘాల అభివృద్ధికి రెవరెండ్ దివంగత పురుషోత్తమచౌదరి చేసిన సేవలు చిరస్మరణీయని విశాఖ సీబీఎస్ చర్చి పాస్టర్ రెవరెండ్ కె.డేనియల్ గాంధీ అన్నారు. పట్టణంలోని అంబటిసత్రం కూడలిలో ఉన్న ఏసు ప్రేమాలయంలో పురుషోత్తమ చౌదరి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, విక్టర్, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, రమణ, కిశోర్, అధిక సంఖ్యలో క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

కుళాయి పనుల పరిశీలన


రెడ్డికంచేరులో చేపడుతున్న ఇంటింటి కుళాయి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి

భోగాపురం: జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీలో ఆర్‌డబ్ల్యూస్ అధికారులు చేపడుతున్న ఇంటింటికీ కుళాయి పనులను సర్పంచ్ బైరెడ్డి రమణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పైపులను భూమిలో వేసే సమయంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పరిశీలనలో ఆయన వెంట మాజీ సర్పంచ్ దుర్గయ్యరెడ్డి, శీరపు వంశీరెడ్డి, చిన్నయ్యరెడ్డి, బంగారిరెడ్డి, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూలంగి సేవ


పూల అలంకరణలో మహాలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో సుందరకాండ హవనం, ఆస్థాన మంటపంలో నిత్య కల్యాణ మహోత్సవాలను వేడుకగా జరిపించారు. అనంతరం ఉపాలయంలో కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారికి పంచామృత స్నపనం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి హరిద్రా కుంకుమలతో అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నెరవేరిన దశాబ్దాల కల..


భోగాపురం జాతీయ రహదారి నుంచి చెరువుకొమ్ము గొల్లపేట వరకు నిర్మించిన తారురోడ్డు


అప్పన్నపేట నుంచి కారిగొల్లపేట వరకు నిర్మించిన సీసీ రోడ్డు

- చెరువుకొమ్ము, కారిగొల్లపేట గ్రామాలకు రోడ్డు సౌకర్యం
- ఎమ్మెల్యే బడ్డుకొండకు కృతజ్ఞతలు

భోగాపురం: మండలంలోని భోగాపురం పంచాయతీ చెరువుకొమ్ము, కారిగొల్లపేట గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరింది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఆ రెండు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవ తీసుకుని రెండు గ్రామాలకు బీటీ, సీసీ రోడ్డు నిర్మించడంతో తమ చిరకాల కల నెరవేరిందని ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుకొమ్ము, కారిగొల్లపేట, కొయ్యపేట, అప్పన్నపేట గ్రామాల్లో 400 కుటుంబాలు ఉండగా... ఆయా కుటుంబాల్లో 2,440 పైగా జనాభా, 900 మంది ఓటర్లు ఉన్నారు. రవాణా సౌకర్యం కోసం రెండు గ్రామాల ప్రజలు కిలోమీటర్‌కు పైగా మట్టి రోడ్డులో ప్రయాణించి మండల కేంద్రంలో భోగాపురం పంచాయతీకి చేరుకోవాలి. ఏ అవసరం ఉన్నా అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రం విజయనగరం లేదా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న తగరపువలస వెళ్లాల్సి ఉంది. మట్టిరోడ్లపై కంకర తేలి, మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు అవస్థలు పడేవారు. భోగాపురం నుంచి ఎరువులు, వ్యవసాయ పనిముట్లు తీసుకెళ్లేందుకు చాలా కష్టపడాల్సి వచ్చేది.

టీడీపీ హయాంలో ఇబ్బందులే..

టీడీపీ హయంలో కారిగొల్లపేట రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు హడవిడిగా శంకుస్థాపన చేశారు. రోడ్డు సౌకర్యం కలుగుతుందని గ్రామస్తులు సంబరపడ్డారు. కానీ ఒక్క అంగుళం కూడా రోడ్డు నిర్మాణం చేపట్ట లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

రూ.1.60 కోట్లతో రోడ్ల నిర్మాణం

చెరువుకొమ్ము, కారిగొల్లపేట గ్రామస్తుల వినతి మేరకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తక్షణమే స్పందిస్తూ రూ.1.60 కోట్లతో రెండు గ్రామాలకు తారురోడ్డు, సీసీరోడ్డు మంజూరు చేయించారు. ఏపీఆర్‌ఆర్‌పీ, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా భోగాపురం జాతీయ రహదారి నుంచి చెరువుకొమ్ము గొల్లపేటకి దాదాపు 1,800 మీటర్ల తారురోడ్డు.. అప్పన్నపేట నుంచి కొయ్యపేట మీదుగా కారిగొల్లపేట వరకు దాదాపు 1,900 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బడ్డుకొండకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నేత్రదానంపై అవగాహన


నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సహన సంతోషి

భోగాపురం: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంఘం సహకారంతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం ఇందిరాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సహన సంతోషి మాట్లాడుతూ, నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. మరణానంతరం ఒక్కరు చేసే నేత్రదానం ఇద్దరి అంధులకు చూపునిస్తుందని తెలిపారు. నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించి, ప్రజలను చైతన్యపరచాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆప్తాలమిస్ట్ మజ్జి గణపతి మాట్లాడుతూ, మరణించిన ఆరు గంటల్లోపు నేత్రాలను సేకరించాలన్నారు. వయసుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులు నేత్రదానం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్‌పీ జయకుమారి, ఆరోగ్య విస్తరణాధికారి ప్రభాకర్, సూపర్‌వైజర్ ఎంవీ సత్యనారాయణ, ఏఎన్‌ఎం బంగారు లక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి


డెంకాడ: వరిసాగు యజామాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాస్త్రవేత్త తేజేశ్వరరావు, అధికారులు

నెల్లిమర్ల రూరల్: అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని తంగుడుబిల్లిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగం మంచిది కాదన్నారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలతో మందులు ఉపయోగించాలని సూచించారు. వరి పంటలో పిలకలు, ఆకుల కత్తిరింపుల సమయంలో ఎంత మోతాదులో తడులు ఇవ్వాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, వీఏఏ శివ, రైతులు పాల్గొన్నారు.

విచ్చలవిడి వినియోగంతో అనర్థాలు..

డెంకాడ: విచ్చలవిడిగా ఎరువులు వినియోగించడం వల్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె. తేజేశ్వరరావు, జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకుడు ఆర్. చంద్రశేఖర్‌బాబు అన్నారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరి పంటలో యూరియా మోతాదుకు మించి పంటలకు వేయడం వల్ల ఆకు ముడత పురుగు ఆశిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సహాయకుడు ఒమ్మి హరికృష్ణ, ఏఓలు బి.రామకోటి, పూడి నిర్మల, గ్రామ పెద్దలు పిట్ట అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: వరిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

ఉచిత వ్యక్తిత్వ, వికాస తరగతులు


మాట్లాడుతున్న స్వామి అర్చనానందజీ మహారాజ్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని శ్రీరామకృష్ణ ధ్యాన మందిరం (రామకృష్ణ సేవా సమితి)ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ, వికాస తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి టి. జగన్నాథరాజు తెలిపారు. ఈ తరగతులకు నాలుగో తరగతి నుంచి పది వరకు చదువుతున్న బాలబాలికలు హాజరుకావచ్చన్నారు. ఈ మేరకు పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు శ్రీ ఆదిత్య విద్యాలయంలో గురువారం వ్యక్తిత్వ, వికాస తరగతులు నిర్వహించారు. శిక్షణ కోసం పేర్లు నమోదు చేసుకునేందుకు 94403 34589 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకుడు అర్చనానందజీ మహారాజ్ కరస్పాండెంట్ సూరిబాబు,హెచ్‌ఎం అమృత పాల్గొన్నారు.

అభినందనలు


విజేతలను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్

విజయనగరం అర్బన్: ఎల్‌ఐసీ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలలో గురజాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎ.శైలజ ప్రథమ, కె. ఓమ్మి ద్వితీయ స్థానాలు సాధించారు. దీంతో విజేతలను పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పేదల పక్షపాతి..

భోగాపురం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పనిచేస్తూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ శీరపు గురునాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రెడ్డికంచేరులో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి పింఛన్ల మంజూరు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజేష్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ పావని, వలంటీర్లు పాల్గొన్నారు.


కొత్త పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ శీరపు గురునాథ్‌రెడ్డి

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

విజయనగరం టౌన్: విశాఖ స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధి చెల్లూరు జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. డేర్ టు డ్రీమ్ థీమ్‌తో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చినట్లు లయన్స్ క్లబ్ బాధ్యుడు ఎంఎస్ఎన్.మూర్తి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ డైరెక్టర్ శర్మ, చైర్‌పర్సన్ ఎస్.అన్నపూర్ణ, వి.ఉమాదేవి, దిలీప్, శంకర్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రాజేశ్వరి, తదితరులు

విజయనగరం రూరల్: సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని వయోజన విద్య ఉపసంచాలకుడు అల్లు సోమేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం మండలం మలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్‌ఎం సుజాత అధ్యక్షతన గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ సుంకరి రాజేశ్వరి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలన్నారు. అక్షరాస్యతతో ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్.లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

మెంటాడ (గజపతినగరం రూరల్): రానున్న ఎన్నికల్లో టీడీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతుందనే భయం చంద్రబాబుకు పట్టుకుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎద్దేవాచేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని చంద్రబాబే స్వయంగా చెప్పుకోవడం వెనుక వాస్తవాలు ప్రజలకు ఇప్పటికే అర్థమయ్యిందన్నారు. రూ.118 కోట్లు ముడుపులు తీసుకోవడం బయటకు పొక్కడంతో చంద్రబాబు ఏమి చేయాలో తెలియక తనను ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుని ప్రజల నుంచి సానుభూతి పొందేందుకు నక్క వినయం ప్రదర్శిస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్రలో మాట్లాడే విధానం సరి కాదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ తండ్రీ కొడుకులు ఇద్దరూ అధికారం కోసం లేనిపోని కుతంత్రాలు చేసేందుకు సిద్ధపడుతన్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని అభివృద్ధిని, సంక్షేమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేపట్టిందన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెపుతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ బూడి ముత్యాలనాయుడు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, సామంతులు పైడిరాజు, కరణం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులే విత్తన తయారీదారులు..

- గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా చేయూత
- ఎంపిక చేసిన రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్న అధికారులు


గ్రామీణ విత్తనోత్పత్తిలో భాగంగా సింగవరంలో పొలంలో రైతులకు సూచనలు,సలహాలు అందిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

డెంకాడ: గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా వరి పండించే రైతులను విత్తనోత్పత్తి కేంద్రాలుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ మేరకు వ్యవసాయశాఖ ద్వారా ఈ కార్యక్రమం పక్కాగా అమలు చేస్తున్నారు. రైతులు తమ విత్తనాలను తామే తయారు చేసుకునే విధంగా రైతులను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రైతులు విత్తనాల కోసం ఇతరులపై ఆధారపడడం ద్వారా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. విత్తన ఖర్చుతో పాటు అనుకున్న సమయానికి విత్తనాలు లభించకపోవడం, నాణ్యమైన విత్తనాలు దొరకకపోవడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ద్వారా వ్యవసాయశాఖ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి రైతులను సిద్ధం చేస్తోంది.

ఎంపిక చేసిన గ్రామాల్లో..

నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో 12 గ్రామాలను విత్తనోత్పత్తి గ్రామాలుగా ఎంపిక చేశారు. విత్తనోత్పత్తి పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామంలో ఎంపిక చేసిన రైతులకు 25 ఎకరాలకు సరిపడా వరి ఫౌండేషన్ సీడ్ (తల్లివిత్తనం) 50 శాయితీపై అందించారు. ఆయా పంట పొలాలకు వెళ్లి వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగులో సమస్య రక్షణ చర్యలు, విత్తనాల తయారీపై శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు అందిస్తున్నారు.

మేలైన విత్తనాలు..

తల్లి విత్తనం ద్వారా వరి పంట సాగు చేయడం వలన మంచి రకం విత్తనం రైతుల వద్దే లభ్యమవుతాయి. ఎకరాకు 20 బస్తాలు పండినట్టితే 25 ఎకరాల్లో 5 వందల బస్తాల వరి విత్తనాలు తయారవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా. అంటే 50 వేల కేజీల విత్తనాలు అందుబాటులో ఉంటాయి. ఎకరాకు 30 కేజీల విత్తనాలు సరిపోతాయి. విత్తనోత్పత్తి ద్వారా పండించే వరి రైతుల వద్ద 1666 ఎకరాలకు సరిపోయే వరి విత్తనాలు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రైతులను సిద్ధం చేశాం..



ఎంపిక చేసిన రైతులకు అవసరమైన తల్లి విత్తనాలు అందజేశాం. జిల్లా స్థాయి అధికారుల నుంచి మండల అధికారుల వరకు అందరూ ఆయా గ్రామాలను సందర్శించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. దిగుబడి బాగుంటే ఎంతోమందికి విత్తనాలు అందించే అవకాశం స్థానిక రైతులకే దక్కుతుంది.

– పూడి నిర్మల, ఏఓ, డెంకాడ.

కషాయాల తయారీపై అవగాహన


జిల్లేడు ద్రావణం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

వేపాడ: మండలంలో కుమ్మపల్లి గ్రామంలో కూరగాయల సాగు రైతులకు సేంద్రియ ఎరువులు, కషాయల తయారీపై ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ శుక్రవారం అవగాహన కల్పించారు. ద్రవజీవామృతం, జిల్లేడు కసాయం, ఇంగువ ద్రావణాన్ని ఎలా తయారు చేయాలో వివరించారు. కూరగాయ పంటలకు వచ్చే తెగుళ్లను నివారించేందుకు ఘన, ద్రవజీవామృతంతో పాటు ఇంగువ ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంటీ త్రినాథ, డెక్క ఈశ్వరరావు, గోకేడ వెంకటరావు, రామస్వామినాయుడు, రమణమ్మ, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.